# గుణవంతుడే బలవంతుడు

కనులలోన కలుగు కాంతియే దేవుడు
పిలుపులోన కలుగు ప్రియము నతడె
మేధ ఉన్నదంచు మీరకు దైవాజ్ఞ
కూలద్రోయ జూచు కుటిలునెపుడు

ఆత్మశుద్ధిలేని అవని చదువులందు
క్రోధమత్సరములు కూడియుండు
చీకటింటిలోన చేరును గబ్బిలాలు
ఉన్నమాట తెలుపుచున్న మాట

**విద్యార్థులారా! విద్యార్థినులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!**

జీవితములో మానవుడు సంకల్పించుకొన్న దానిని సాధించవలెనన్న అచంచల దీక్ష అత్యవసరము. చంచల మనస్సుగల మానవుడు ఏ కార్యమును కడపటికి సాధించలేడు. అచంచలమనస్సు, అవిరళకృషి, దీక్ష విద్యార్థులకు ప్రధానమైన సూత్రములు. బాలబాలికలు బంగారువంటి భవిష్యత్తును తీర్చిదిద్దుకొనవలెనన్న, గౌరవమర్యాదలను కాపాడుకొనవలెనన్న, నిర్విరామకృషి, అచంచల దీక్ష సాధించుటకు ప్రయత్నించవలెను. జీవితములో వివిధ పరిధుల మధ్య సామరస్యము, సమన్వయము, సంరక్షించుకోవటమే విద్యార్థుల యొక్క ప్రధాన కర్తవ్యము. సామరస్య సమన్వయములు ఉండినప్పుడే మానవత్వము అర్థవంతమవుతుంది. విభేదములు విస్మరించి, సామరస్య సమన్వయములు సాధించినవాడే సరైన మానవుడు. విశాలమైన ఈ దేశమునందు ప్రతి మానవునకు ఇందులో ప్రధానమైన అధికారము ఉన్నది. ప్రతి పౌరుడు ఈ జగత్తునందు ఒక సామాజిక వ్యక్తిత్వము కలిగినటువంటివాడే. ఈ ప్రపంచమే ఒక సమూహమైన కుటుంబము. ఇందులో మమత్వమును, సమత్వమును సాధించినవాడే విద్యార్థి.

srisathyasaivachanamrutam

ఈ సామరస్య సమన్వయములు క్రీడలయందు, వ్యాయామమందు కొట్టివచ్చినట్లు కనిపించుచున్నవి.

**శారీరక పుష్టి, మానసిక పవిత్రత అవసరము**

వ్యాయామముచేతను, క్రీడలచేతను దేహమునకు పుష్టి పవిత్రమైన మానవత్వము, ఆరోగ్యము కూడను సాధించుటకు అనేక అవకాశములు ఉంటున్నవి. మానవుడు కేవలము స్థూలమైన స్వరూపమే కాదు. దీనికి సూక్ష్మస్వరూపము మరొకటి ఉన్నది. అదే మనస్సు. మానసిక పవిత్రతను, చారిత్రక దివ్యత్వాన్ని హృదయ నిర్మలత్వాన్ని సాధించుటయే మానసిక పవిత్రత. శారీరకముగా మానసికముగా పరిశుద్ధమైన, పవిత్రమైన నిర్మల నిశ్చల నిస్వార్థమైన స్వరూపము ధరించినప్పుడే మానవుడు శాంతి భద్రతలను చేకూర్చుకోగలడు. కనుక మానవునకు శారీరక పుష్టిని మానసిక పవిత్రతను అత్యవసరముగా సాధించవలసిన బాధ్యత కలదు. విద్యార్థి తనయొక్క క్రీడలయందు ఉన్నతమైన బహుమతిని, ఉన్నతమైన స్థానమును సాధించవలెనని ఏ దీక్ష, ఏ ప్రతిజ్ఞ, ఏ ప్రజ్ఞను అవలంబించునో అదే దీక్ష శ్రద్ధ ప్రతిజ్ఞ అన్ని రంగములయందు కూడను చేకూర్చుకోవలసివస్తుంది.

ఇందులో నైతిక ఆధ్యాత్మిక రంగములయందు అత్యవసరముగా సాధించవలసినది ఈ యొక్క నిర్మలత్వము. ప్రపంచములో ఏ చిన్న ఉపకారమునకు మానవుడు అనేక విధములైన కృతజ్ఞతలను ఇచ్చుకుంటున్నాడు. ఇన్ని విధములుగా జీవితమునకు ఆధారమై, అన్ని విధముల సంరక్షించుటకు సహాయమై ఉండిన పంచభూతముల యొక్క తత్త్వాన్ని అనుగ్రహించిన పరమాత్మకు మనము కృతజ్ఞతను చూపనక్కరలేదా? త్రాగేనీరు, పీల్చేగాలి ఉండే భూమి అనేక విధములుగా జీవితానికి అనుకూలించే పరిస్థితులు కూడను భగవంతుని వరప్రసాదములే. ఎన్ని పంపుసెట్లు పెట్టి పని చేసినప్పటికిని ఒక్క కుంభవర్షమునకు సాటి చేకూరకలదా? ఎన్ని విధములైన విసనకఱ్ఱలతో విసురుకున్నప్పటికిని మలయ మారుతమునకు సాటిరాగలదా? ఎంత powerful bulbs మనము వేసుకున్నప్పటికి సూర్యప్రకాశమునకు దీటు కాగలదా? లోకానికి ప్రకాశము అందించే సూర్యచంద్రాదులు, సర్వజీవులకు ప్రాణము కల్పించే గాలి వానలు ప్రసాదించే దైవత్వమును ఈనాడు మనము విస్మరించి అల్పమైన సుఖములను

srisathyasaivachanamrutam

విశ్వసించి మానవత్వము కేవలము నిరర్థకము గావించుకోవటానికి ప్రయత్నిస్తున్నాము.

ప్రాచీనకాలము నుండి అనేకమంది మహనీయులు అనేక భక్తిశ్రద్ధల చేత భగవంతుని ఆరాధించటము కృతజ్ఞత చిహ్నమే. దీనికే భక్తి అని పేరు వచ్చింది. ఇది నవ విధమార్గములందు ప్రపంచమునందు ఆవరించి ఉంటున్నది.

**నవ విధ భక్తులు**

**శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనం**
**అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మ నివేదనమ్**

శ్రవణం. కేవలము శ్రవణము చేతనే దివ్యత్వాన్ని ఆత్మతత్త్వముగా విశ్వసించి దైవత్వముతో లీనము గావించుకున్నట్టి పవిత్రమైన వ్యక్తి భారత చక్రవర్తి పరీక్షిన్మహారాజు. సర్వకాల సర్వావస్థల యందు, మానవత్వము అనుగ్రహించి, జంతూనాం నరజన్మ దుర్లభమ్ మానవ జన్మము అత్యుత్కృష్టమైనదని, జీవితాన్ని చాటే నిమిత్తమై నారదుడు నిరంతరము గానము గావించుచూ కీర్తనచేత తనయొక్క కృతజ్ఞత చెల్లించుకున్నాడు. బాలుడై, దివ్యప్రకాశమును అందుకొన్న అనుగ్రహపాత్రుడై ఉండిన ప్రహ్లాదుడు నిరంతరము, సర్వకాల సర్వావస్థలయందును ఓం హరి ఓం హరి అనే నామస్మరణ చేతనే తనయొక్క కృతజ్ఞతను భగవంతునికి చూపించుకున్నాడు. మరి కొంతమంది పాదసేవ ద్వారా దివ్యమైన దివ్యత్వమునకు సేవలు సలిపి తమయొక్క కృతజ్ఞతను చెల్లించుకున్నారు. అక్రూరుడు వందనం చేత తన కృతజ్ఞతను అందించుకున్నాడు. పృథుమహారాజు అర్చనం చేత తన కృతజ్ఞతను అందించుకున్నాడు. సేవలచేత హనుమంతుడు కూడను రామచంద్రునకు తనయొక్క కృతజ్ఞతను తెలుపుకున్నాడు. స్నేహముచేత అర్జునుడు కృష్ణునకు తనయొక్క కృతజ్ఞతను అందించుకున్నాడు. ఆత్మార్పణచేత బలిచక్రవర్తి తనయొక్క కృతజ్ఞతను భగవంతునికి అర్పించుకున్నాడు. ఈనాటి సమస్త సాధనలు కూడను భగవంతుడు అనుగ్రహించినవే. మనకు భగవంతుడు ప్రసాదించిన మంచికి, సుఖమునకు, శాంతికి, సంతోషమునకు కృతజ్ఞత అర్పించుకోవటమే భక్తునియొక్క ప్రధానకర్తవ్యమని దీనినే భక్తి అనే పేరుతో జగత్ వ్యాప్తి గావించుకుంటూ వచ్చింది. కొన్ని కొన్ని సందర్భములయందు దివ్యమైన భావములు కలిగినప్పటికి వారికి కొన్ని సమయములందు పతనము ఏర్పడుతూ ఉంటుంది.

sri sathyasai vahamrutam

దీనస్థితి సంభవిస్తూ ఉంటుంది. కాని అది తాత్కాలికమే. తమ జీవితములో తిరిగి కోలుకొనుటకుగాని, ఉన్నతస్థాయి అందుకొనుటకుగాని అవకాశము ఉంటున్నది.

**గుణవంతుడే బలవంతుడు**

వ్యక్తిగతంగాకాని, సామాజికముగాకాని శరీర ఆరోగ్యపుష్టితో బాటు సద్గుణములు కూడను పోషించుకోవాలి. కర్మశూరుడే ఈ జగత్తునందు ప్రకాశించగలడు. కనుక మన విద్యతోబాటు గుణములు కూడను అభివృద్ధి గావించుకోవటము విద్యార్థులయొక్క ప్రధాన కర్తవ్యము. ఒక బంతి ఉంటుంటాది. అది క్రిందవేస్తే తిరిగి పైకి ఎగురుతుంది. ఉత్తముడు, కృతజ్ఞత కలిగినవాడు జీవితము కూడను అంతే. ఏదో కొన్ని సమయములందు తాను హీనస్థితియందు క్రింద పడినప్పటికి తిరిగి కొంతకాలములో తానుపైకి రాగలడు. మట్టి ముద్ద క్రిందవేస్తే పైకి ఎగరదు. కృతజ్ఞత లేని మానవుడు, గుణములేని మానవుడు ఒక్కతూరి పతనమాయెనా తిరిగి తానుపైకి రాలేడు. ఉన్నత స్థితి అందుకోలేడు. రావణ యుద్ధసమయమునందు తేజోవంతుడైన వ్యక్తి, బలశాలియైన వ్యక్తి, కాంతితో కూడిన వ్యక్తి, క్రోధముతో కూడినవ్యక్తి ఎదురు పడ్డాడు. అతని తేజస్సును, అతని బలపరాక్రమములను చూసిన రాములు విభీషణుని అడుగుతున్నాడు. ఆ మహనీయుడు ఎవ్వరని. విభీషణుడు రామా అతనే మీ విరోధియైన రావణుడు అన్నాడు. అహా ఇంత తేజోవంతుడు, ఇంత పరాక్రమవంతుడు, ఇంతటి బలవంతుడు అయిన ఈ రావణునకు తుచ్ఛమైన బుద్ధిఉండటంచేతనే వాడు ఇంత నీచస్థితికి దిగిపోయాడు. లేకుండిన ముల్లోకాధిపతిగా తాను ప్రకాశించి ఉండేవాడని ఆశ్చర్యపడ్డాడు రాముడు.

విద్యార్థులారా! మనకెంత భుజబలము, బుద్ధిబలము, విద్యాబలము, విజ్ఞానబలము ఉండినప్పటికిని గుణబలమే లేకుండిన కేవలము ఇది రాక్షస గుణముగానే రూపొందుతుంది. ఈ సర్వబలములతోబాటు గుణబలము కూడను మనము చేర్చుకోవాలి. సాధించాలి. గుణశీలుడైన మానవుడు ఈ జగత్తునందు సాధించలేనిది ఏ మాత్రము లేదు. మనకు జీవితములో అనేక కష్టదుఃఖములు వెంటాడుతూ ఉంటాయి. నింద నిష్ఠూరములు కూడను మనలను వెంటాడుతూఉంటాయి. ఈ అన్నింటిని తట్టుకొని నెట్టుకొని సాధించిన వ్యక్తి నిజమైన మానవుడు. ఆత్మవిశ్వాసమును, ఆత్మబలమును మనము అభివృద్ధి గావించుకోవాలి. ఆత్మబలహీనుడైన

srisathyasaivachanamrutam

వానికి యే చిన్నకార్యము సాధించుటకు వీలుకాదు. ఒక పవిత్రమైన ఆదర్శమైన జీవితమును మనము అందించవలెనన్న దివ్యమైన భవ్యమైన భావాలు మన హృదయము లోపల అభివృద్ధి గావించుకోవాలి. ఆదర్శమునకు విద్య ప్రధానము కాదు. మానవ జీవితమును పోషించుకొనే నిమిత్తము విద్య అవసరమేగాని ఆదర్శవంతమైన మానవత్వాన్ని నిరూపించవలెనన్నను, ప్రకటించవలెనన్నను మనము గుణశీలురు కావాలి. జీవనోపాధి నిమిత్తమై ఆచరించేవి గుణములు. సుగుణములతోబాటు విద్య, విద్యతోబాటు సుగుణములు ఉన్నప్పుడే negative positive చేరినట్లుగా ఈ రెండింటి యొక్క ఐకమత్యము చేత ఆనందము మనకు ప్రాప్తిస్తుంది. ఎలాంటి కార్యమునైనను సాధించవచ్చును.

**థామస్ ఆల్వా ఎడిసన్ వృత్తాంతము**

దైవవిశ్వాసము, కార్యదీక్ష ఈ రెండు విద్యార్థులకు అత్యవసరము. మీకు తెలుసు. థామస్ ఆల్వా ఎడిసన్. ఇతను అమెరికా దేశములోపల 1847వ సంవత్సరములో ఫిబ్రవరి 11వ తేదీన ఓహాయ్ అనే రాష్ట్రములోపల మెలోర్ అనే గ్రామములో పుట్టాడు. ఇతను తల్లిదండ్రుల దగ్గర అనేక విధములుగా నేర్చుకొని కూడను అక్షరశూన్యుడైపోయినప్పటికిని దైవవిశ్వాసము చేతను, కార్యదీక్ష చేతను అనేకవిధములైన, ఆశ్చర్యకరమైన శక్తులను సాధిస్తూ వచ్చాడు. అతను తొమ్మిదవ సంవత్సరమునందే అనేక విధములైన పరిశీలనలకు పాల్గొన్నాడు. తల్లిదండ్రులు విద్యలు చెప్పించే నిమిత్తమై అనేక విధములుగా శ్రమపడ్డారుగాని ఫలితము లేకపోయింది. స్కూలుకు వెళ్ళేవాడు కాదు. ఏదో ఆటవస్తువులు తన చేతిలో పట్టుకొని ఒక మూలను కూర్చొని అన్నీ విప్పటము మరల తిరిగి చేర్చటము ఈ విధమైన పరిశోధన లోపల నిమగ్నుడౌతూ వచ్చాడు.

ఒకనాడు తల్లితండ్రులు కోపించినారని ప్రక్కఇంటి ధాన్యాగారములో కొన్ని పరిశోధనలు ప్రారంభించాడు. ఆ పరిశోధనలో కొంత ప్రమాదము జరిగింది. పెద్దశబ్దము వచ్చి తద్వారా ఆ ధాన్యపుకొట్టంతా కాలిపోయింది. ఈ ప్రమాదమునకు థామస్ కారణమని గుర్తించి తండ్రి ఆ పిల్లవాని చేతులు కాళ్ళు కట్టి బజారునకు ఈడ్చుకొని వచ్చి బాగా కొట్టాడు. ఇంకపైన ఈ విధమైన పరిశోధనలు చేయకూడదని చెప్పి ప్రతిజ్ఞ చేయమని కోరాడు. కాని జవాబు

sri sathyasaivachanamrutam

చెప్పలేకపోయాడు. కాని తల్లి దగ్గరకు పోయి కాళ్లుపట్టుకొని అమ్మా ఈ పరిశోధనలు నేను చేయటానికి తండ్రి దగ్గర నుండి పర్మిషన్ అందించమన్నాడు. మాతృమూర్తియైన తల్లి అతి జాలి చేత కుమారుని అభివృద్ధిని ఆశించి ఈ పరిశోధనలకు అనుమతి ఇవ్వమని కోరింది భర్తను. భార్యయొక్క బలవంతముచేత తిరిగి పరిశోధనలకు అమోదించాడు తండ్రి. ఆనాటి నుండి తన ఇంటి లోపల ఏదో పరిశోధనలు ప్రారంభించాడు. అక్కడ కూడను ఒక పెద్ద శబ్దము ఏర్పడి నిప్పుమంటలు ప్రారంభమైనాయి. వారిది చాలా బీద కుటుంబము. వారికున్న సామానంతయు భస్మమైంది. దీనితో తండ్రి మరింత ఉగ్రుడయ్యాడు. అతనిని 11వ సంవత్సరము లోపల ఇంటి నుండి బయటకు పంపించాడు. ఆ పిల్లవానికి వేరొక ఆధారము లేదు. తన హృదయము లోపల ఒక విధమైన ప్రతిజ్ఞ పెట్టుకున్నాడు.

**పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టునెగ్గెడుదాక అట్టె యుండు**
**కోరిన దేదియో కోరనే కోరితివి**
**కోర్కె చెల్లెడుదాక కొలిచియుండు**
**అడిగినదేదియో అడుగనే అడిగితివి**
**అడిగినదిడుకాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలపు తీరెడుదాక తరలకుండు**

**పోరుపడలేక తానైన ప్రోవవలయు**
**ఒడలు తెలియక మీరైన అడుగవలయు**
**అంతియేగాని మధ్యలో ఆపివేసి**
**తిరిగి పోవుట నాయొక్క దీక్ష కాదు**

అన్నాడు. తల్లితండ్రులకు దూరమై బజారులో ఒక పిచ్చివానివలె ఉంటూ వచ్చాడు థామస్. ఏదో వారిని వీరిని ఆశ్రయించి, అక్కడ లోకల్ ట్రైన్సు ఉంటాయి. ఈ ట్రైన్ లోపల బ్రెడ్, బిస్కట్లు సప్లై చేసే చిన్న ఉద్యోగము సంపాదించుకున్నాడు. ఆ ప్యాసింజర్సుకు అందించే



sri sathyasai vacharamrutam

సమయములో అందించటము తరువాత తానొక బాత్‌రూమ్‌లోకి పోవటము అక్కడ కూడను ఈ పరిశోధనలు ప్రారంభించాడు. ఈ పరిశోధనల ఫలితముగా బాత్‌రూమ్‌లో ఒక పెద్దశబ్దము ఏర్పడి అక్కడ మంటలు ప్రారంభమైనాయి. ఎన్ని విధములైన బాధలకు గురియైనప్పటికిని తన సంకల్పమును తాను విడువలేదు. గార్డు వచ్చి ఆ పిల్లవానిని రెండు చెవులు గట్టిగ నొక్కి క్రిందికి నెట్టివేశాడు. చెవులు దెబ్బతిని వినటం కోల్పోయినాడు. చాలా విచారముతో ఆ రైల్వేలైను పక్కలో నడచుకుంటూ వెళుతున్నాడు పాపం. తలయెత్తి చూచేటప్పటికి ఒక భయంకరమైన దృశ్యము కనుపించింది అతనికి. వెనుకవైపున ఒక ట్రైను వేగంగా వస్తున్నాది. ఒక చిన్నపిల్లవాడు ఆ లైనుపైన నడుస్తూ పోతున్నాడు. కొన్ని క్షణములలోపల ఆ పిల్లవానికి సంభవించే ప్రమాదాన్ని పసిగట్టి ఈ పిల్లవాడు గట్టిగ పట్టి అతనిని ప్రక్కకు లాగాడు. ఈ ఉపకార ఫలితముగా ఆకర్షింపబడిన పిల్లవాని తల్లితండ్రులు థామస్‌ను ఇంటికి పిల్చి చక్కగా భోజనము పెట్టి నాయనా నీ పరిస్థితి యేమిటని స్థితిగతులను చక్కగా విచారించారు. తనయొక్క పరిశోధనలు తనఇంటి యొక్క దుస్థితి ఉన్నది ఉన్నట్టుగా సత్యాన్ని చెప్పాడు. ఆ యజమాని యొక్క సహాయముచేత టెలిగ్రాఫ్ కంపెనీ లోపల ఒక చిన్నపని కల్పించాడు. అక్కడ నుండి ప్రారంభమైంది. ఈ విధముగా ప్రారంభమవుతూ జగత్తుకుఈ వెలుతురును అందించే బల్బును కనిపెట్టినవాడు థామస్. గ్రామఫోను కనిపెట్టినవాడు ఈ థామస్. రక్షక సంబంధమైన యంత్రములనంతా కనిపెట్టినది ఈ థామస్. అక్షర శ్రీకారములేని ఈ థామస్ ఈ అనంతమైన జగత్తుకు ఈ ప్రకాశమును అందించాడు. దీనికి చదువేనా కారణము. కాదు. పట్టుదల, సుజ్ఞానము, తనయొక్క గుణశీలము ఇదే మూలకారణము.

**మానవత్వమే దివ్యత్వముగా మారుతుంది.**

కనుక విద్యతోబాటు మనయందు పవిత్రమైన గుణములను అభివృద్ధి గావించుకోవాలి. మనయొక్క చిత్తమును అరికట్టటానికి సత్సంగమును అభివృద్ధి చేసుకోవాలి. కనుక ఉత్తమ పురుషులచేత మనము సరియైన సంబంధము కల్పించుకున్నప్పుడే మానవత్వము దివ్యత్వమైన ఆత్మతత్త్వముగా రూపొందుతుంది. దీనినే భజగోవింద మనే దానియందు అనేక విధములైన ఆదర్శ సూత్రాలను అందిస్తూ వచ్చారు. మన చిత్తమును మన స్వాధీనము నందుంచుకొని

sri sathyasai vahini

మానసిక తత్త్వము కొంతవరకు అరికట్టటానికి సత్సంగము అత్యవసరము.

**ఉత్తమ పురుషులకోసము చేసిన**
**చిత్తము నిలుచును నిజమండి**
**మత్తుడవై మరి మోహము చెందిన**
**మొత్తును యముడిట నిజమండి**
**హరిగోవిందా హరిగోవిందా**
**హరిగోవిందా అనరా మందా**

మానవత్వములో ఉండిన దానవత్వమును మనము ఆవిర్భవింప చేసుకోవాలంటే ఆనందమనే భావముచేత భగవంతుని స్మరించాలి. దైవమనగా మరొక ప్రదేశము నందు లేదు. నీవే దైవముయొక్క ప్రతిబింబము. ఆ ప్రతిబింబముయొక్క ప్రతిధ్వనియే నీయొక్క ఏడుపు, ప్రతిధ్వనియొక్క చర్యలే నీయొక్క స్వధర్మము. కనుక అంతర్వాణియొక్క ఆనంద శబ్దమును నీవు ఆచరణయందుంచి నీయొక్క మానవత్వాన్ని దివ్యత్వముగా ఆదర్శవంతముగా నిరూపించుకోవాలి.

విద్యార్థులారా! విద్యార్థినులారా! మానవత్వములో మనయొక్క స్థితి భవిష్యత్తులో ఎంతో ఆదర్శమును అందించేటువంటిది. మానవ జన్మము ఎంతనో ఉత్కృష్టమైనది, పవిత్రమైనది, దివ్యమైనది, జీవించతగినది. ఈ విజ్ఞానము యొక్క ప్రభావము చేత మానవుడు కేవలము పక్షులవలె ఆకాశమందు సంచరించటము కూడా నేర్చుకున్నాడు. చేపలవలె అనంత సముద్రమునందు ఈ తాడి రక్షించుకోవటము కూడా నేర్చుకున్నాడు. కాని దురదృష్టవశాత్తు మానవుడు భూమిపైన నివసించే మానవునిగా జీవించటం నేర్చుకోలేదు. మానవుడు మానవుడుగా జన్మించటం గొప్పతనము కాదు. మంచి మానవునిగా తీర్చిదిద్దుకోవటమే గొప్పదనము. ఆదర్శవంతమైన మానవునిగా మనము నిరూపించుకోవాలి. మనలో సద్గుణములు ప్రకాశింప చేసుకోవాలి. కన్న తల్లితండ్రులకు సత్కీర్తి తెప్పించాలి. మన జన్మ మనకు సరైన ధన్యతను చేకూర్చాలి. జన్మించిన దేశమునకు, జన్మమిచ్చిన తల్లికిని కృతజ్ఞతను మనము అందించాలి. ఇదే రామాయణమునందు అందించిన ధర్మ సూత్రము. జననీ జన్మ భూమిశ్చ

srisathyasaivachanamrutam

స్వర్గాదపి గరీయసి. నా తల్లికంటె, నా మాతృదేశము కంటె స్వర్గము కూడను నాకు సరియైనది కాదు. దానికి మించినది నా తల్లి అన్నాడు. కనుకనే

**ఇది నా మాతృదేశము**
**ఇది నా ప్రియమాతృభాష ఇది నామతం**
**బెదగొట్టి నుడువ నేరక**
**బ్రతికిన నడపీనుగొకడు వసుధను గలడా!**

దేశాభిమానమనేది విద్యార్థులకు అత్యవసరము. ఈ దేశాభిమానమనే పేరుతో పరదేశమును మనము ద్వేషించరాదు. నీ దేశాన్ని నీవు విశ్వసించు. నీ దేశాన్ని నీవు కాపాడు, నీ దేశాన్ని నీవు సంరక్షించుకో. దేశమునకు అపకారము నీవు తలపెట్టకూడదు. జాతి భ్రాంతిని తొలగించు. మతములోని మాలిన్యము తొలగించు. సర్వులు ఏమేమన్న జ్ఞానమును నింపుకో. అన్నీ మతముల ఏకత్వము ఒక్కటనేది విశ్వసించు. ఎల్ల లోకములు ఒక ఇల్లు మాదిరి విశ్వసించు. ఇదియే విద్యార్థిలో ఉన్న సమత్వాన్ని మనము అభివృద్ధి గావించుకోవాలి. ఎవరిని మనము ద్వేషించరాదు ఎవరిని మనము హింసించరాదు. మన జీవితములో ఏమి చేసినప్పటికిని Reaction, Resound, Reflection. తప్పదు.

### ప్రేమతత్త్వాన్ని పంచిపెట్టండి

విద్యార్థులారా! విద్యార్థినులారా! సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ నందు చేరిన మీరు ఆదర్శవంతమైన జీవితాన్ని, ప్రేమతత్త్వాన్ని, దివ్యమైన ఆత్మతత్త్వాన్ని మీరు అనుభవించి ఆచరించి ఇతరులకు అందించి మీరు ఆనందిస్తారని నేను ఆశిస్తున్నాను. ఆనందమునకు ఆరోగ్యము అత్యవసరము. ఆరోగ్యమునకు ఆటలు ప్రధానము. మనము ఈ ఆటలయందు సక్రమమైన మార్గమును అనుసరించి ఆటలయొక్క కీర్తిని కూడను మనము సంరక్షించాలి. కాలమును వ్యర్థము చేయరాదు. ఎందుకంటే కాలస్వరూపుడైన దైవమును కర్మలద్వారా మనము ఆనందమును అనుభవించాలి.

విద్యార్థులారా! అనేకమంది మీరు భాగవతము చదివే ఉండేవచ్చు. దుందుభి అనే వాని కథ ఉంటున్నాది అందులో. విద్యార్థి అయినవాడు నాలుగు ఐదు గంటల మధ్యన లేచి తన

కాలకృత్యములు పూర్తి గావించుకొని తనయొక్క స్నానము పూర్తి గావించుకొని తమ చదువుల లోపల తాను మునగాలి. నాలుగు ఐదు గంటల మధ్యలేచి తన కాలకృత్యములు తీర్చుకొని స్నానమాచరించినవారు ఋషిస్నానము అని చెప్పింది భాగవతము. ఐదుకు ఆరుకు మధ్యలో స్నాన సంధ్యలు ఆచరించిన వారిని మానవస్నాన మన్నారు. ఏడుగంటల తరువాత ఆచరించిన స్నానానికి రాక్షస స్నానమన్నారు. ఈ దుందుభి ఏడుగంటల తరువాత స్నానమాచరించేవాడు. అనగా పవిత్రమైన బ్రహ్మముహూర్త కాలములో అపవిత్రము గావించేవాడు. కాలము దుర్వినియోగము గావించేవాడు దుందుభి అని చెప్పారు.

ప్రశాంతమైన సమయములో, సుప్రభాతము జరుగుచున్న సమయములో కాలము అపవిత్రము గావించుకొని రగ్గును కప్పుకొని పడుకోవటం సరైన పనికాదు. ఈ విధముగా కాలమును అపవిత్రమును చేయటము చేత మనయొక్క కాంతి రేఖలు క్షీణించిపోతాయి. మొట్టమొదట మీకు శ్రమగా కనిపించవచ్చు ఈ కాలము. కాని అభ్యసించుకొలది అది మనకు ఆనందాన్ని ఇస్తుంది. నిదానముగా నిద్ర నుండి లేచినవాడు సోంబేరిగా రూపొందుతాడు. ఈ రక్తకణములన్ని అతి తీవ్రమైన దీనితో జ్ఞాపకశక్తిని అందిస్తూ పోతుంటాయి. ఈ శరీరమునకు తగిన కృషిని మనము అందించాలి. అందువలననే కృషిసల్పినవాడు ఋషి అవుతాడన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా మీరు మీయొక్క కార్యక్రమముల లోపల ఈ యొక్క ఆటలయందు, పాటలయందు, చదువుయందు, సర్వకార్యములందు దేహమును దారుఢ్యవంతముగా రూపొందింప చేసుకోవాలి.

ఆరోగ్యమే మహాభాగ్యము. ఆరోగ్యము లేనివాడు దేనిని సాధించలేడు. ఈ ఆరోగ్యము నిమిత్తము, ఆనందము నిమిత్తము ఆటలు ఏర్పడినవి, పాటలు ఏర్పడినవిగాని వ్యాపార నిమిత్తమై ఏర్పడినవి కాదు. ఈనాడు ఆటపాటలు వ్యాపారరంగముగా రూపొందినాయి. మన ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులు తమయొక్క దివ్యమైన, తమ స్వశక్తిని, స్వప్రకాశమును, ఆనందమును అందించుటకు ఈ ఆటపాటలయందు మీరు పాల్గొనాలి. కాని ఈనాడు పెరుగుతూ పెరుగుతూ పోయే కొలది ఆటపాటలందు మీరు కొంతవరకు దూరమైపోతున్నారు. కాని మన ఇన్‌స్టిట్యూట్ లోపల తప్పనిసరిగా ఆటలలో పాల్గొనాలి. స్వార్థ స్వప్రయోజనములు దూరమునెట్టాలి.

sri sathyasai vachanamrutam

సమత్వభావము అభివృద్ధి పరచుకోవాలి. మనమందరము సోదరులము, సోదరీమణులమనే దివ్యమైన సమత్వమును పెంచుకోవాలి. ఒకరినొకరు ద్వేషించుకోకుండా తిరస్కరించుకోకుండా ప్రేమధర్మమే మన ప్రధానమైన సూత్రమని భావించి ఈ ప్రేమను ప్రధానమైన లక్ష్యములో ఉంచుకొని పోషించుకోవాలి.

**(తేది. 14-01-1989న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam